క్లుప్తంగా

50 మద్యం బాటిళ్లు స్వాధీనం



నాగాయలంక: అవనిగడ్డ మండలం వేకనూరు గ్రామానికి చెందిన లింగం అనిల్ కుమార్ అక్రమంగా మద్యం తరలిస్తుండగా నాగాయలంక సాయిబాబా గుడి సెంటర్‌లో ఆదివారం పట్టుకుని 50 క్వార్టర్‌ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని స్థానిక ఎస్.ఐ కలిదిండి రాజేష్ చెప్పారు. నాగాయలంక నుంచి వేకనూరు గ్రామంలో ఇంటి వద్దకు మద్యం బాటిళ్లు తీసుకెళ్లి అధిక ధరలకు అమ్ముతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. సిబ్బందితో కలసి వెళ్లి ఎలాంటి లైసెన్స్ లేకుండా మద్యం బాటిళ్లు కలిగి ఉన్నందున అనిల్‌కుమార్‌ను పట్టుకున్నామని చెప్పారు. మధ్యవర్తుల సమక్షంలో విచారించగా వేకనూరులో అమ్మడానికే తీసుకు వెళ్తున్నట్లు అంగీకరించాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

అభిషేక పూజలు



నాగాయలంక: గ్రామంలోని పురాతనమైన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం అభిషేకాలు, పూజ, విశేష అలంకారం ఆలయ అర్చకుడు మహంకాళి ప్రకాష్ శర్మ అర్చకత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని నిత్య అన్నదాన సేవా కమిటీ ఆధ్వర్యంలో 35 మంది నిరుపేదలు, దివ్యాంగులకు దాత మునగాల కుటుంబరావు, తేజశ్రీ దంపతుల వితరణతో అన్నదానం చేశారు. పొన్నపల్లి చిన్న, లంకమ్మ, మత్తి శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచార బోర్డు ఏర్పాటు చేయాలి

బంటుమిల్లి: స్థానిక ఆర్టీసీ బస్టాండులో బస్సుల రాకపోకల సమాచార బోర్డును ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. బంటుమిల్లి కేంద్రంగా కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలకు ప్రయాణికుల రాకపోకలు ప్రతిరోజూ ఎక్కువగా జరుగుతుంటాయి. మచిలీపట్నం, గుడివాడ, నర్సాపురం బస్ డిపోల నుంచి బస్సులు ఉదయం 5.30 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు రాకపోకలు చేస్తుంటాయి. 216 జాతీయ రహదారి నిర్మాణం పూర్తి అయిన తర్వాత మచిలీపట్నం-నర్సాపురం-కాకినాడల మధ్య ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. భీమవరం, నర్సాపురం పట్టణాల నుంచి హైదరాబాదు హైటెక్ బస్సులు నడుపుతున్నారు. అయితే ఈ బస్సుల రాకపోకల వివరాల సమాచారం చెప్పేందుకు వ్యక్తులుగాని, బోర్డుగానీ లేదు. గతంలో ఆర్టీసీ ఆవరణ అభివృద్ధి సమయములో ఎండి, చైర్మన్ వస్తున్నారని ఏర్పాటు చేసిన బోర్డు పాడైంది. ఆర్టీసీ అధికారులు స్పందించి బోర్డు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

213 మందికి కంటి వైద్య పరీక్షలు



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక నీలామహల్ రోడ్‌లోని అల్లంబడి ఆవరణలో విజయవాడకు చెందిన కామినేని హాస్పిటల్ వైద్యబృందం ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో తదితర పరీక్షలు ఉచితంగా చేశారు. 213 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కేవలం రూ.300కు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎం.శివరామకృష్ణ, కార్యదర్శి కె.రామారావు, కోశాధికారి కె.రామకృష్ణ, వైద్యులు డాక్టర్ ఎల్.వర్ధన్, డాక్టర్ సాయి ప్రమోద్, డాక్టర్ అజయ్ పాల్గొన్నారు.

అప్సా డెమొక్రటిక్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) డెమొక్రటిక్ గుడివాడ డివిజన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. స్థానిక స్లేటర్‌పేటలోని రెయిన్‌బో హైస్కూల్లో నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా అర్జా ప్రసాదు, కార్యదర్శి ఎల్.జగదీష కోశాధికారి ఎల్. శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడిగా ఎ.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి. దామోదర్, ఎం.నరసింహారావు, పి.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ ఎస్.శారద, కార్యవర్గ సభ్యులు ఎల్.స్రవంతి, టి. శోభాకుమారి, టీవీ రమణకుమారి, హేమంత్‌రెడ్డి, శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు.

బందరుకు ఆధ్యాత్మిక శోభ



విద్యుత్ దీపాల అలంకరణలో రంగనాయకస్వామి



మిలాద్ - ఉన్ - నబీ సందర్భంగా నాగపోతరావు సెంటరు నుంచి ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాలు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నగరంలో రెండు మతాలకు సంబంధించిన పండుగల నిర్వహణకు స్నేహభావంతో ముందుకు సాగుతున్నారు. ఓ పక్క గణపతి నవరాత్రి మహోత్సవాలు నగరంలో జరుగుతున్నాయి. సోమవారం మహ్మద్ ప్రవక్త జన్మదినం (మిలాద్-ఉన్-నబీ)ను ఘనంగా నిర్వహించేందుకు ముస్లింలు సన్నద్ధమయ్యారు. నగరంలోని నాగపోతరావు సెంటరు నుంచి చింతచెట్టు సెంటరు వరకు ప్రధాన రహదారిలో విద్యుత్ దీపాలతో ముస్లింలు అలంకరణ చేశారు. కోనేరు సెంటర్ మొత్తాన్ని విద్యుత్ దీపాల పందిరి వేశారు. సెంటర్ డివైడర్‌లోని విద్యుత్ స్తంభాలకు పచ్చని విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. నగరంలోని పలు గణనాథుని పందిళ్ల వద్ద విద్యుత్ దీపాల అలంకరణలతో పాటు పందిళ్ల అలంకారం ఆకట్టుకుంటోంది. మరో పక్క నగరంలోని రాబర్ట్సన్‌పేటలో శ్రీ రంగనాయకస్వామి ఆలయంలో సోమవారం నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ ద్వారం వద్ద రంగనాయకస్వామి విద్యుత్ దీపాలతో చిత్రాలను ఏర్పాటు చేశారు.

జై గణేశా... బై బై.. గణేశా

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రులు ఆదివారంతో 9వ రోజుకు చేరాయి. మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో భక్తులు ఏర్పాటు చేసిన పందిళ్లలో గణనాథుని విగ్రహాలకు పూజాదికాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. లడ్డూల వేలం, ప్రసాదాల పంపిణీ, నిమజ్జనోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉల్లాసంగా ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు.

–మచిలీపట్నంటౌన్/పెడన/బంటుమిల్లి/నాగాయలంక/ఘంటసాల



పెడన పట్టణంలోని 17వ వార్డులో విద్యార్థుల కర్రసాము



పెడన పట్టణంలోని 15వ వార్డులో ఊరేగింపునకు సిద్ధంగా..



నాగాయలంక మండలం నంగేగడ్డలో గణేశునికి పూజ



ఘంటసాల తూర్పు రామాలయం నుంచి నిమజ్జనానికి..



నిమజ్జనానికి పయనమైన బంటుమిల్లి సంతబజారు గణపయ్య



ఘంటసాల మండలం శ్రీకాకుళంలో వినాయకునికి పూజలు



నిమజ్జనానికి వెళ్తున్న గూడూరు గణనాథుడు



మచిలీపట్నం టౌన్ బైపాస్ రోడ్డులో..



మట్టి గణపయ్యతో పెదతుమ్మిడి ఉత్సవ కమిటీ సభ్యులు



నాగాయలంక ఏడోవార్డుకు నిమజ్జనోత్సవ ఊరేగింపు..



నాగాయలంకలో నిమజ్జనోత్సవంలో బాలల జోష్



నిమజ్జనానికి బయల్దేరిన బంటుమిల్లి 2వ వార్డు గణనాథుడు

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు ప్రారంభం

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు గౌరవం పెంచే స్థాయిలో యూటీఎఫ్ పనిచేస్తూ ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో యూటీఎఫ్ పాలుపంచుకుంటుందన్నారు. ఉపాధ్యాయుడికి ఏ కష్టం వచ్చినా, ఇబ్బందులు వచ్చినా వాటిని పరిష్కరించడంలో యూటీఎఫ్ ఎనలేని పాత్ర పోషిస్తుందని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నాయకులు మండలి వెంకట్రామ్ (రాజా), యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఏ ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బి.కనకారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లెనిన్‌బాబు, గౌరవ అధ్యక్షుడు నీలం ప్రభాకరరావు, నాయకులు షౌకత్ హుస్సేన్, మరీదు ప్రసాదరావు, యూటీఎఫ్ జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ నాయకులతో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

రెండు ఆర్టీసీ బస్ సర్వీసుల ప్రారంభం

అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఆదివారం రెండు నూతన బస్ సర్వీసులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. ప్రయాణికులకు ఉపయోగ పడేలా పలు సర్వీసులను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీటీవో ఏ.వాణిశ్రీ, డిపో మేనేజర్ కె.హనుమంతరావు, జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్,యూనియన్ నేతలు పాల్గొన్నారు.

విషప్రయోగంతో 15 కోళ్లు మృతి




చిలకలపూడి(ఘంటసాల): కోళ్లకు విషం పెట్టి చంపిన సంఘటన మండలంలోని చిలకలపూడి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితురాలు కొణతం వెంకటేశ్వరమ్మ తెలిపిన వివరాల మేరకు.. చిలకలపూడి గ్రామానికి చెందిన తాను పదేళ్ల క్రితం భర్త చనిపోవడంతో వచ్చే ప్రభుత్వ పెన్షన్‌తో పాటు కోళ్లను పెంచుకుంటూ జీవిస్తున్నానని తెలిపింది. కుమారులు వివిధ ప్రాంతాల్లో ఉంటున్నారు. ఆదివారం ఉదయం 30 కోళ్లను బయటకు విడిచి పెట్టగా వెళ్లిన కోళ్లు కొన్ని గంటల్లోనే ఒకదాని తర్వాత ఒకటిగా 15 కోళ్లు చనిపోయాయి. వీటి విలువ సుమారు రూ.30 వేలు ఉంటుంది. మిగిలిన కోళ్ల జాడ కానరాలేదు. కోళ్లకు విషం పెట్టి చంపడంతో జీవనోపాధి కోల్పోయానంటూ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. గతంలో ఓసారి ఇలాగే కోళ్లు చనిపోయాయని, మరలా ఈ రోజు కోళ్లు చనిపోయాయని వెంకటేశ్వరమ్మ తెలిపింది. దీనిపై పోలీసులకు, ఇతర అధికారులకు ఫిర్యాదు చేస్తే ఏమవుతుందోనని, కోళ్లను చంపిన వారు ఒంటరిగా ఉంటున్న తనను ఏమైనా చేస్తారేమోనని భయపడాల్సి వస్తోందని చెప్పింది. అధికారులు, పెద్దలు జోక్యం చేసుకోవాలని వేడుకుంది.

లైంగికదాడి కేసులో నిందితుడిపై చర్యలు తీసుకోవాలి

ఐద్వా నేత కొడాలి సుజాత

మచిలీపట్నంటౌన్: స్థానిక గుమాస్తాల కాలనీకి చెందిన మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నగర కార్యదర్శి కొడాలి సుజాత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జ్యోతిరావుపూలే విజ్ఞాన కేంద్రంలో ఐద్వా నగర కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికపై జరిగిన బెదిరింపు, అత్యాచారాన్ని ఖండిస్తున్నామన్నారు. బాలిక తల్లి అంధురాలని, కుటుంబానికి ఎలాంటి పోషణ లేనందున ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. బాలికను ప్రభుత్వమే చదివించాలన్నారు. బాలిక తల్లికి ఇళ్ల స్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు పరసా లక్ష్మి మాట్లాడుతూ అధికారం చేపట్టిన నెల రోజుల్లో గంజాయి రహిత రాష్ట్రంగా చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వ పెద్దలు గంజాయిని నివారించటంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. నగరంలో గంజాయి పలు చోట్ల విచ్చలవిడిగా అమ్ముతున్నా పోలీసులు పట్టించుకోవటం లేదన్నారు. గంజాయి మత్తులో పవన్‌కుమార్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి పలు గొడవల్లో ఉంటున్నాడని అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐద్వా నగర కమిటీ సభ్యులు బూర భవాని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా కార్యదర్శి కొడాలి సుజాత

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ సన్నిధిలో పాల పొంగళ్లను పొంగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం ఆదివారం వేలాది మది భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్ ఏర్పాట్లు చేశారు.



మురికి కూపంగా వాసవీనగర్



గుడివాడ టౌన్: స్థానిక ఏలూరు రోడ్ నాగవరప్పాడులోని వాసవీనగర్ మురుగు నీటితో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. కొంతకాలంగా డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో కచ్చా డ్రెయిన్లు పూడుకుపోయాయి. మురుగునీరు రోడ్లపైనే తిష్టవేస్తున్నాయి. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షపు నీరు తోడు కావడంతో మురుగంతా రోడ్లపైనే తిష్టవేసింది. కొన్ని ప్రాంతాల్లో నడవడానికి కూడా ఇబ్బందిగా ఉందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటి కారణంగా రాత్రయితే దోమలు దాడులు చేస్తున్నాయని వాపోయారు. అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పక్కా డ్రెయిన్‌లు నిర్మించక పోయినా కనీసం మురుగునీరు బయటకు పోయేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజారోగ్యం పట్టని అధికారులు



నీటితో నిండిపోయిన రహదారి

చిలకలపూడి(మచిలీపట్నం): అధికారులకు ప్రజారోగ్యంపై శ్రద్ధ కొరవడింది. కలెక్టరేట్ వెనుక ఉన్న మునిసిపల్ పార్కు, ఇతర గృహసముదాయాలకు వెళ్లే రహదారి పరిస్థితులు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా జలమయమైనప్పటికీ నీటిని తొలగించే కార్యక్రమం మునిసిపల్ అధికారులు చేపట్టడం లేదు. మూడు నెలలుగా తాము రాకపోకలు నిర్వహించడానికి రహదారి లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే మోకాలు లోతు నీటిలో వెళ్లాల్సి వస్తోందని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. డీఈవో కార్యాలయానికి వచ్చే సిబ్బందితో పాటు ఆ రహదారిలో ఉన్న కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువ రోజుల నుంచి నీరు నిల్వ ఉండటంతో నాచు పెరిగిపోయి దోమలు, క్రిమికీటకాలువిపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో ఈ ప్రాంత ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. మునిసిపల్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా నీటిని తోడేందుకు ప్రయత్నాలు చేయటంలేదు. ప్రజాప్రతినిధులు, మునిసిపల్ కమిషనర్ స్పందించి నీటిని తొలగించి పారిశుద్ధ్యం మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే

మచిలీపట్నంటౌన్: ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజినీర్స్ డేను నగరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పంపుల చెరువు వద్ద ఉన్న ఎలక్ట్రికల్ ఈఈ కార్యాలయంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ఈఈ ఎం.భాస్కరరావు, ఇంజినీర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ నేటి ఇంజినీర్లకు విశ్వేశ్వరయ్య ఆదర్శనీయమన్నారు. స్థానిక 45వ డివిజన్ పార్కులో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నగర కమిషనర్ బాపిరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రముఖ ఇంజినీర్ రాయపాటి మురళీధర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా పార్కులో మొక్కలు నాటారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన నాయకులు పీవీ ఫణికుమార్, వెలుగు, మైత్రి ఫౌండేషన్ ప్రతినిధులు నంగేగడ్డ బాబు, వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇంజినీర్ మురళీధర్‌ను సన్మానిస్తున్న కమిషనర్ బాపిరాజు తదితరులు

వైభవంగా సత్యసాయి బాబా జన్మదినోత్సవం

ఘంటసాల: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 100వ జన్మదినోత్సవం ఘంటసాల గ్రామంలోని శ్రీసాయి మినీ కల్యాణ మండపంలోని స్వామివారి ఆలయంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి సేవా సంస్థల కృష్ణా జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ మాట్లాడుతూ శ్రీ సత్యసాయి బాబా జన్మదినోత్సవం విశ్వశాంతి, లోక కల్యాణార్థం నిర్వహించామన్నారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, కృష్ణాజిల్లా వేదాధ్యయన విభాగం ఆధ్వర్యంలో సేవా సంస్థల జిల్లా అధ్యక్షుల పర్యవేక్షణలో జరిగిందని తెలిపారు. గుడివాడ నుంచి వచ్చిన 25 మంది బాల వికాస్ విద్యార్థినులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. ముందుగా శాంతి పతాకాన్ని ఆవిష్కరించి జయంతి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మహాప్రసాద వితరణ చేశారు. శ్రీ సత్యసాయిసేవా సమితి ఘంటసాల కన్వీనర్ పోలన జయప్రసాద్, లక్ష్మీప్రసన్న, సాయి జ్యోతి, అనిల్ కుమార్, మురళీ కృష్ణ, జిల్లా నలమూలల నుంచి సాయి భక్తులు పాల్గొన్నారు.



పూజల్లో సత్యసాయి బాబా భక్తులు

వరద బాధితులకు సాయం

నాగాయలంక: చినకరకట్ట కింద వరద ప్రభావిత మత్స్యకార కుటుంబాలకు దుప్పట్లను పంపిణీ చేశారు. స్థానిక క్లాత్ మర్చంట్స్ గోలి కోటేశ్వరరావు, ఆయన కుటుంబ సభ్యులు గోలి సుధాకర్, షణ్ముఖి, అందె మధుసూదనరావు, బిట్ర వెంకటేశ్వరరావుల వితరణతో ఈ సాయం అందించారు. ఆదివారం కృష్ణానది తీరంలోని మత్స్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో 90 మత్స్యకార కుటుంబాలకు రూ.15 వేల విలువైన దుప్పట్లు, బిస్కెట్లను స్థానిక మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు లకనం నాగాంజనేయులు, కుటుంబ సభ్యుల చేతుల మీదుగా అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు లంకె శ్రీనివాస ప్రసాద్, డోకిపర్తి నాగేశ్వరరావు, కర్రి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు సాయం అందిస్తున్న గోలి కుటుంబ సభ్యులు

1,500 మందికి భోజన సదుపాయం

కె.కొత్తపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని కె.కొత్తపాలెంలో వరద బాధితులకు బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం అచ్యుతాపురం గ్రామస్తులు ఆదివారం రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. కొత్తపాలెంకు చెందిన గుంటూరు వరబాబు, గుంటూరు జీవన్‌బాబు, కైతేపల్లి యాకోబు అభ్యర్థన మేరకు సుమారు 1,500 మందికి భోజనాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జనసేన మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, మత్తి వంశీ కృష్ణ, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, మత్తి మురళీకృష్ణ, తుటారం శివకోటేశ్వరావు, మాజీ సర్పంచ్ పొలిమెట్ల వెంకటేశ్వరావు, అచ్యుతపురం గ్రామం యువకులు పాల్గొన్నారు.



కె.కొత్తపాలెంలో వరద బాధితులకు భోజనం అందిస్తున్న అచ్యుతాపురం గ్రామస్తులు

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన కారు



పల్లెపాలెం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన కారు

కృత్తివెన్ను: ఆదివారం తెల్లవారుజామున పల్లెపాలెం వాటర్ ప్లాంటు వద్ద విజయవాడ నుంచి భీమవరం వైపునకు వెళ్తున్న కారు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్పగాయాలైనట్లు సమాచారం. 216 జాతీయ రహదారిపై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. హైవేపై వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్నాయని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఉదయం సీతనపల్లి వద్ద కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రగాయాలు పాలుకాగా, అదే రోజు సాయంత్రం లక్ష్మీపురం సమీపంలో రోడ్డు పక్కన ఇసుక గుట్టనుబైక్ ఢీ కొని మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రమాదాలపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.